క్లుప్తంగా

రేపు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

హనుమంతునిపాడు: వైఎస్సార్ సీపీ మండల కార్యకర్తల సమావేశం ఈ నెల 28న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసుల రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండల కార్యకర్తల సమావేశం, అనుబంధ కమిటీల ఏర్పాటు చేస్తామన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, ఇతర నేతలు హాజరు కావాలని కోరారు.

నవోదయలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సత్తా

పామూరు: జవహర్ నవోదయ కలుజువ్వలపాడు 2025–26 విద్యాసంవత్సరం 6వ తరగతిలో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షల్లో పామూరు మండలం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తాచాటారు. పామూరు ఎంపీపీఎస్ విరాట్‌నగర్ పాఠశాలకు చెందిన ధన్యశ్రీ రెడ్డి, మండలంలోని మోపాడు ఎంపీయూపీఎస్ పాఠశాలకు చెందిన దగ్గ శరణ్య, ఎంపీపీఎస్ కందులవారి పాపాయపల్లి పాఠశాల విద్యార్థి మేకల శ్రీతనుష్, పామూరు ఎంపీపీఎస్ 2వ వార్డు పాఠశాలలోని పి.వి.ఎస్.హరీశ్వర్‌రావు, ఎంపీపీఎస్ మోపాడు కొత్తపల్లె పాఠశాలకు చెందిన రావినూతల అనుదీప్‌లు సత్తా చాటి కలుజువ్వలపాడు నవోదయ పాఠశాలలో సీటు సాధించారు. విద్యార్థులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టంగుటూరు: మండలంలోని కొణిజేడు శ్రీ శ్రీనివాస యూపీ స్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు నవోదయలో ప్రవేశం పొందారని ఎంఈఓ చెంచుపున్నయ్య తెలిపారు. విద్యార్థులు టి. జశ్వంత్‌రెడ్డి, బి.సాయి లక్ష్మి, జె. వసీర్ బాషా, డి.నాయబ్రసూల్, ఎం వెంకట రాఘవేంద్ర ఎంపికయ్యారు. వారికి పాఠశాల కరస్పాండెంట్ కొల్లి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రంగసుబ్బారాయుడు

హనుమంతునిపాడు: తాగునీటి సమస్య తలెత్తకుండా కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ ఎం.రంగసుబ్బారాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచినీటి పథకాలు, చేతి పంపు బోర్లు మరమ్మతులకు గురైతే వెంటనే రేపర్ చేయించాలన్నారు. సాగర్ జలాలు సక్రమంగా సరఫరా అయ్యేట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

షాపులకు బహిరంగ వేలం

కందుకూరు: పట్టణంలోని రైతుబజార్ పక్కన ఉన్న పాతలారీ స్టాండ్ స్థలంలో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న షాపులను అద్దె ప్రాతిపదికన కేటాయించేందుకు ఈనెల 29వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.అనూష బుధవారం తెలిపారు. కాంప్లెక్స్‌లోని షాపు నెంబర్–1 ఎస్సీ వర్గాలకు కేటాయించామని, అలాగే షాపు నంబర్లు 13, 15లను జనరల్ కేటగిరిలకు కేటాయించినట్లు తెలిపారు. షాపులకు ఈ నెల 29వ తేదీ ఉదయం 11గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన లబ్ధిదారులు వేలంలో పాల్గొనాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సింగరాయకొండ: మండలంలోని జంట గ్రామాలైన సింగరాయకొండ, మూలగుంటపాడు పంచాయతీల్లో మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ సాంబశివరావు తెలిపారు. మూలగుంటపాడులో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సింగరాయకొండలో ఉదయం ఒక గంట సేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఉపాధిలో అవకతవకలకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామాంజనేయులు

కొండపి: ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎంపీడీఓ రామాంజనేయులు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మేట్లకు ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనికి సంబంధించిన ఐడీలు, మస్టర్లలో అవకతవకలకు పాల్పడకుండా ఉండాలని సూచించారు. ఎక్కువ మంది కూలీలు హాజరు అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఏపీఓ మహాలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ ఎదురుచూపులు..!

- కొత్త రేషన్‌కార్డుల కోసం తప్పని నిరీక్షణ
- సచివాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న అర్హులు
- కార్డు లేకపోవడంతో సంక్షేమ పథకాలకు దూరం...
- కార్డుల ఊసే ఎత్తని ప్రభుత్వం



పీసీ పల్లి సచివాలయం

పీసీపల్లి:

ఆరోగ్యశ్రీ మొదలు రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందాలంటే రేషన్ కార్డు తప్పనిసరి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు దాటినా రేషన్ కార్డులపైఇప్పటి వరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో పేదలు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. గత 9 నెలలుగా అర్హులు కార్డుల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదిక్షణలు చేస్తున్నారు. అయితే సచివాలయ సిబ్బంది మాత్రం ప్రభుత్వం ఎటువంటి ఆదేశాలు రాలేదని చెప్పడంతో లబ్ధిదారులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఓ పక్క కొత్త కార్డులు ఇవ్వకపోగా, ఉన్న కార్డుల్లో చేర్పులు, మార్పులు అనుమతి కూడా ఇవ్వకపోవడంతో కూటమి ప్రభుత్వంపై అర్హులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిరంతర ప్రక్రియ

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ ఎప్పటికప్పుడు రేషన్‌కార్డులు అందేవి. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అర్హుల ఇళ్ల వద్దకే వెళ్లి దరకాస్తు చేయించేవారు. ఎవరితో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా వచ్చేవి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. వలంటీర్ల వ్యవస్థ లేకపోవడంతో గ్రామస్థాయిలో ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలో తెలియక ఎంతో మంది ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం మాటలతో కాలయాపన చేస్తుందే తప్ప ప్రజలకు ఒక్క పని కూడా కావడం లేదు. ఈ తొమ్మిది నెలల్లో ఎందరికో వివాహాలు అయ్యాయి. కుటుంబంలో కొత్త సభ్యులు వచ్చారు. వీరంతా ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరితో ఇబ్బందులు పడుతున్నారు. అన్ని అర్హత ఉన్నా రేషన్ కార్డు మంజూరు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మళ్లీ పాత కష్టాలే ?

2014–2019 మధ్య టీడీపీ అధికారంలో ఉన్న సమయంలోనూ ఇదే విధంగా రేషన్‌కార్డులు మంజూరు చేయకుండా ఇబ్బందులకు గురిచేసింది. అప్పట్లో కొత్త రేషన్‌కార్డులు కావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ అర్హులు ప్రదక్షణలు చేయాల్సి వచ్చేది. ఈ కారణంతో ఎంతో మంది అర్హులకు అన్యాయం జరిగింది.

ప్రభుత్వం నుంచి సమాచారం లేదు:

కొత్త రేషన్ కార్డు జారీకి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాచారం లేదు. నిబంధన ప్రకారం ఆదేశాలు వచ్చిన వెంటనే అర్హులందరికీ మార్గదర్శకాల ప్రకారం కార్డులు అందేలా చూస్తాం.

ధర్మతేజ, డిప్యూటీ తహసీల్దార్

కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలి:

రేషన్‌కార్డుల కోసం ఎంతో మంది ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు దాటినా నేటికీ కార్డుల మంజూరుపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. కనీసం మార్పులు, చేర్పులకు కూడా అవకాశం ఇవ్వకుండా లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వీలైనంత త్వరగా కార్డు మంజూరు చేసి పేదలను ఆదుకోవాలి

బాల్‌రెడ్డి, సీపీఐ నాయకుడు

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా



మాట్లాడుతున్న దద్దాల నారాయణయాదవ్



కస్తూరిరెడ్డిని సన్మానిస్తున్న దద్దాల, గఫార్, ఇతర నేతలు

- వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్

కనిగిరిరూరల్: ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటానని, పార్టీలో విలువలు, విశ్వసనీయతతో పనిచేసిన వారికి రానున్న రోజుల్లో జగనన్న పెద్ద పీట వేస్తారని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం వైఎస్సార్ సీపీ కనిగిరి మండల కార్యకర్తల సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు మడతల కస్తూరిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి అందరి సలహాలు, సూచనలతో ముందుకు సాగుతానన్నారు. బడుగు బలహీన వర్గానికి చెందిన తనకు జగనన్న సీటు ఇచ్చి ప్రోత్సహించి.. ఉన్నత స్థానాన్ని కల్పించారన్నారు. మనమంతా జగనన్న సైనికులమని, 2029లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకోవడమే లక్ష్యంగా పనిచేద్దామన్నారు. పోరాటాలతో వచ్చిన పార్టీ వైఎస్సార్ సీపీ అని, అధైర్యం లేకుండా అధికార పార్టీ ఆగడాలపై పోరాటాలు చేద్దామని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు నేతృత్వంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కమిటీలను నియమిస్తున్నట్లు తెలిపారు. ప్రతి మండలంలో సుమారు 450 మంది కమిటీ సభ్యులు ఉన్నారని.. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి కనిగిరిలో వైఎస్సార్ జెండాను ఎగురవేసి జగనన్నను సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు.


హామీలు అమలు చేయలేకే డైవర్షన్ పాలిటిక్స్..

కూటమి సర్కార్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలకు సున్నం పెట్టిందన్నారు. అధికారంలోకి వచ్చితొమ్మిది నెలలు అయినా ఒక్క పథకాన్ని అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందన్నారు.

కస్తూర్‌రెడ్డికి ఘన సన్మానం.

పార్టీ కనిగిరి మండల అధక్షునిగా నియమితులైన జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డిని దద్దాల నారాయణ యాదవ్, చైర్మన్ అబ్దుల్ గఫార్, పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి, తమ్మినేని సుజాత, పార్టీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కస్తూరిరెడ్డి మాట్లాడుతూ పార్టీ శ్రేణుంతా కలిసి కట్టుక పని చేసి.. ప్రతి గ్రామంలో పార్టీని బలోపేతం చేద్దామన్నారు. కూటమి నేతల ఆగడాలపై న్యాయ పోరాటాలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలన్నారు. రానున్న రోజులు వైఎస్సార్‌సీపీ వేనన్నారు. వైస్ ఎంపీపీలు, వైస్ చైర్మన్లు లక్కిరెడ్డి తిరుపతిరెడ్డి, పులి శాంతి, ఆర్ మాణిక్యరావు, గాలిబోయిన ధనుంజయ్, తమ్మినేని సుజాతరెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, జీ అబ్రహం లింకన్, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, పోతు రమణారెడ్డి, మహేంద్రా రెడ్డి, టి. కృష్ణారెడ్డి, పి. సిద్ధారెడ్డి, దాదిరెడ్డి మాల కొండారెడ్డి, శ్రీహరిరెడ్డి, ఎం నాగమణి, వాకుమళ్ల రాజశేఖరరెడ్డి, తడికమళ్ల వెంకటేశ్వర్లు, దాసరి మురళీ, చింతం శ్రీను, మూలే గోపాల్‌రెడ్డి, గోడి నారాయణరెడ్డి, మద్ది తిరుపతయ్య, ఆవుల తిరుపతిరెడ్డి, మాలీ యాదవ్, నాగేంద్రారెడ్డి, వెంకటస్వామిరెడ్డి, ఇండ్లా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు

సీఎస్‌పురం(పామూరు): పంచాయతీ కార్యదర్శులు స్థానిక ఎంపీటీసీలు, సర్పంచ్‌లను సమన్వయం చేసుకొని వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు అన్నారు. వేసవిలో నీటి ఎద్దడి సమస్యలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు వారి వారి గ్రామాల్లో నీటి సమస్యలపై క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించాలన్నారు. ఎక్కడైనా బోర్, పైప్‌లైన్‌ను సరిలేకపోతే వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. నిధులకు వెనుకాడవద్దని అవసరమైతే మండల పరిషత్ నిధులను ఖర్చుచేసి నీటి వసతి కల్పించడం ద్వారా నీటి ఎద్దడి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వచ్చే నెల 4వ తేదీన నిర్వహించే మండల సర్వసభ్య సమావేశంలోగా దీనిపై పూర్తిస్థాయిలో ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు.

చిన్నారుల్లో వచ్చే లోపాలు గుర్తించాలి



శిక్షణ ఇస్తున్న సూపర్‌వైజర్ విక్టోరియా రాణి

కొండపి: అంగన్‌వాడీ కార్యకర్తలు గృహ సందర్శనలు చేసి మూడేళ్ల లోపుచిన్నారులకు వచ్చే లోపాలు గుర్తించాలని సూపర్‌వైజర్ విక్టోరియా రాణి అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణలో ఆమె మాట్లాడుతూ గృహ సందర్శనలో చిన్నారుల్లో వచ్చే వికలాంగత్వాన్ని నివారించవచ్చని, అలస్యమైతే పిల్లలకు శాశ్వతమైన వికలాంగత్వం వచ్చే అవకాశం ఉందన్నారు. సీడీపీఓ మాధవీలత, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

పొన్నలూరు: పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి సిరిగిరి గోపాల్‌రెడ్డి విమర్శించారు. మిర్చి పంటకు కనీస మద్దతు ధర కల్పించాలని ప్రతి రోజు రైతులు ఆందోళన చేస్తుంటే సీఎం చంద్రబాబుకు చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్ మిర్చి పంటకు క్వింటా రూ. 20 వేల నుంచి రూ.27 వేల వరకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకున్నారన్నారు. పెట్టుబడి ఖర్చులు పెరిగి రైతులు పంట సాగుకు పెట్టిన ఖర్చులు కూడా రాకపోతుంటే సీఎం చంద్రబాబు క్వింటా మిర్చి ధర రూ.11500 ప్రకటించడం దారుణమన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కంది, శనగ పంటలకు మంచి గిట్టుబాటు ధర కల్పించారన్నారు. కంది పంటకు క్వింటా మద్దతు ధర రూ.8 వేల నుంచి రూ.10 వేలకు, శనగ పంటకు క్వింటా రూ.10 వేల నుంచి రూ, 12 వేలకు మద్దతు ధర ఇచ్చి రైతులను ఆదుకున్నారన్నారు. కానీ నేటి కూటమి ప్రభుత్వం కంది పంటకు కనీస మద్దతు ధర క్వింటాకు రూ.7550, శనగ పంటకు రూ.5000 కేటాయించి రైతుల నెత్తిన శఠగోపం పెట్టారన్నారు. రాష్ట్రంలో ఏ పంటకు కూడా కనీస మద్దతు ధర లేక అన్నదాతలు రోడ్లెక్కి ఆందోళనలు చేస్తున్నారన్నారు. కొంత మంది రైతులు అప్పుల పాలై చేసేదేమీ లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు స్పందించి రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

రూ.10 వేల ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న జాలిరెడ్డి

సింగరాయకొండ: మండలంలోని బింగినపల్లి ఎస్టీ కాలనీలోని ఎంపీపీ స్కూలు ఎస్ఎంసీ సభ్యురాలు కత్తి మంగమ్మకు బుధవారం పాఠశాల ఉపాధ్యాయుడు కేశవరపు జాలిరెడ్డి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఇటీవల మంగమ్మకు మధుమేహ వ్యాధి కారణంగా కాలివేలు తొలగించారు. దీంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మంగమ్మకు ఉపాధ్యాయులు జాలిరెడ్డి, బీసాబత్తిన శ్రీనివాసరావులు ఆర్థికసహాయం చేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఎస్ఎంసీ సభ్యులు పోట్లూరి మాలాశ్రీ, యాకశిరి వాణి, దేవూరి అల్లూరమ్మ, పోట్లూరి రమణయ్య, వార్డు మెంబరు చేవూరి శ్రీను పాల్గొన్నారు.

వెంకటరెడ్డి భౌతికకాయానికి దద్దాల నివాళి



వెంకటరెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న దద్దాల, ఇతర నేతలు

కనిగిరిరూరల్: కనిగిరి నీటి సంఘం మాజీ అధ్యక్షుడు యాళ్ల వెంకటరెడ్డి మంగళవారం రాత్రి మృతి చెందారు. స్థానిక కొత్తూరులోని గృహంలో యాళ్ల వెంకటరెడ్డి భౌతిక కాయాన్ని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ బుధవారం సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, జడ్పీటీసీ, పార్టీ మండల అధ్యక్షుడు మడతల కస్తూరిరెడ్డి, కౌన్సిలర్ తమ్మినేని సుజాతరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి జి.ఆదినారాయణరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు చింతం శ్రీనివాసుల యాదవ్, యాళ్ల శ్రీనివాసులరెడ్డి, విశ్వనాథరెడ్డి, అచ్చాల రమణారెడ్డి, యాళ్ల కృష్ణారెడ్డి, మడతల నాగిరెడ్డి, భూమిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి, చంటి, ఈర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్' వెంటనే అమలు చేయండి



ఆర్ఐ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహిళా సంఘ నేతలు

సింగరాయకొండ: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల ప్రకారం సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి బి మంజుల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయాలని కోరుతూ ప్రగతి శీల మహిళా సంఘం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మంజుల మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒక్కటీ కూడా అమలు చేయని చెత్త ప్రభుత్వం అని విమర్శించారు. తరువాత ఆర్ఐ ప్రసాద్‌కు వినతి పత్రం ఇచ్చారు.

అనంతరం సోమరాజుపల్లి ఎస్టీ కాలనీ మసిళలు మంజుల ఆధ్వర్యంలో ఎంపీడీఓను కలిసి వినతిపత్రం అందజేశారు. గృహాలు నిర్మించుకోవడానికి అనుమతులు వచ్చాయని, జాబ్‌కార్డులు మంజూరు చేయాలని కోరారు. ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు సీహెచ్ పద్మ, జిల్లా నాయకులు కె.సుబ్బులమ్మ, కె.యలమందమ్మ, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు ఆర్ మోహన్, రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.నాంచార్లు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వేళలా అండగా ఉంటాం..



పూనూరి ప్రకాశంను పరామర్శించి ఆర్థికసాయం అందజేస్తున్న హుసేన్‌రెడ్డి

పామూరు: వైఎస్సార్ సీపీకి చెందిన ప్రతి నాయకునికి, కార్యకర్తకు పార్టీ అధిష్టానం, తాము అన్నివేళలా అండగా ఉంటామని పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి అన్నారు. మండలంలోని వగ్గంపల్లె గ్రామానికి చెందిన సయ్యద్ ఖాజా నాయబ్‌రసూల్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. బుధవారం గంగసాని హుసేన్‌రెడ్డి మృతుని నివాసానికి వెళ్లి వారి కుటుంబసభ్యులను పరామర్శించి మృతుని కుమారుడు ఫయాజ్‌కు ఆర్థికసాయం అందజేశారు. అదే గ్రామంలో పూనూరి ప్రకాశం ఇటీవల బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురయి విశ్రాంతి తీసుకుంటుండగా ఆయనను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, కల్లూరి రామిరెడ్డి, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు షేక్.నాయబ్‌రసూల్, జొన్నలగడ్డ గోవిందయ్య, బీసీసెల్ చెనికల శ్రీనివాసులు, ఎస్సీసెల్ తాతపూడి రాము, క్రిస్టియన్‌మైనారిటీసెల్ ఎండ్లూరి సాల్మన్, పార్టీ ఉపాధ్యక్షుడు ఎలికా అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల విద్యాభివృద్ధికి కృషిచేయాలి



శిక్షణ ఇస్తున్న సూపర్‌వైజర్ రమాదేవి

పొన్నలూరు: అంగన్‌వాడీ కార్యకర్తలు బోధనా నైపుణ్యాలను పెంపొందించుకొని చిన్నారుల సమగ్ర విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. మండలంలోని ముండ్లమూరివారిపాలెంలో గత మూడు రోజులుగా నిర్వహించిన ×బీ పడాయి బీ₹ శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం మారుతున్న విద్యా విధానాలు పట్ల అంగన్‌వాడీలు అవగాహన కలిగి చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను అందించాలన్నారు. ఎప్పటికప్పుడు ఆటపాటలతో కూడిన సృజనాత్మక బోధనను అందించాలన్నారు. మర్రిపూడి సూపర్‌వైజర్ సుచరిత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అనధికారికంగా బ్యార్నీలు నిర్మించొద్దు



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న అధికారులు

టంగుటూరు: బోర్డు అనుమతి లేకుండా అనధికారికంగా బ్యార్నీలు నిర్మించవద్దని, ఇప్పటికే నిర్మించిన వారికి నోటీసులు జారీ చేశామని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో బుధవారం మల్లవరప్పాడు, గొర్లమిట్ట, మట్టిపాడు గ్రామాలకు చెందిన రైతులు 235 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 165 బేళ్లను కొనుగోలు చేసి 70 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.260, సరాసరి రూ.271.60గా నమోదైంది. వేలంలో 12 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం నిర్వహించిన వేలంలో కనిష్ట ధర రూ.250 పలికిందని వేలం నిర్వహణ అధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. కట్టవారిపాలెం, ముప్పరాజుపాలెం, పెరిదేపి, మిట్టపాలెం గ్రామాలకు చెందిన రైతులు 555 బేళ్లను వేలానికి తీసుకురాగా అందులో 460 బేళ్లను కొనుగోలు చేసి వివిధ కారణాలతో 95 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, సరాసరి ధర రూ.262.22 నమోదైంది. వేలంలో 12 కంపెనీల వ్యాపారులు పాల్గొన్నారు.

నూరుశాతం పన్ను వసూలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ హనుమంతరావు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని అన్ని పంచాయతీల్లో నెలాఖరు లోగా నూరుశాతం ఇంటి పన్నులు వసూలు పూర్తి చేయాలని డీఎల్‌పీఓ ఎన్‌వీఎల్ హనుమంతరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ఇంటిపన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. త్వరితగతిన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు పూర్తిచేయాలని ఆదేశించారు. పీఏస్‌లు బ్రహ్మానందరెడ్డి, వాణి, పలువురు పాల్గొన్నారు.


మహిళలు ఆర్థికంగా ఎదగాలి



శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలతో సిబ్బంది

కొండపి: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం వెంకటేశ్వర్లు అన్నారు. రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. యువత శిక్షణలో నైపుణ్యాలు పొంపెంపొదించుకోవాలన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. స్కిల్ హబ్ సమన్వయ అధికారులు, ఐఎల్‌ఓ ట్రైనర్లు రవీంద్ర, ప్రదీప్, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ గోపీకృష్ణ, మహిళలు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో అధిక దిగుబడి



హాజీపురంలో పాల్గొన్న ఏడీఏ వెంకటరమణ

హనుమంతునిపాడు: విత్తనశుద్ధితో అధిక దిగుబడి సాధించవచ్చని ఏడీఏ వెంకటరమణ, ఏఓ రమణ అన్నారు. మండలంలోని కూటాగుండ్ల, హాజీపురం గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోందిలో వారు పాల్గొని మాట్లాడారు. పొలంబడి పరిశీలకులు శ్రీహరి ప్రసాదు, డిటర్ చిరంజీవి, ఏఇఓ గోపీకృష్ణ, గ్రామ వ్యవసాయ సహాయకులు భారతీ , షేక్ అక్రమ్ రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంగన్‌వాడీలకు శిక్షణ తరగతులు

మర్రిపూడి: అంగన్‌వాడీ కార్యకర్తలకు ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సూపర్‌వైజర్ బి.సుచరిత ఒక ప్రకటనలో తెలిపారు. సీడీపీఓ డి.మాధవీలత ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణ తరగతులకు కూచిపూడి, మర్రిపూడి సెక్టార్ పరిధిలోని 53 మంది కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

వడ్డీలో 50 శాతం రాయితీ

కనిగిరిరూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు ఏక మొత్తంలో ఒకేసారి చెల్లించిన వారికి ఇప్పటి వరకు ఉన్న వడ్డీ నుంచి 50శాతం వడ్డీ మాఫీ చేయనున్నట్లు కమిషనర్ దానియేల్ జోసఫ్ తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉందన్నారు. పట్టణ ప్రజల సౌకర్యార్థం పండుగ సెలవు, ఆదివారం దినాల్లో కూడా పన్నులు చెల్లించేందుకు పురపాలక సంఘ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు వివరించారు.

అటెండర్‌పై చర్యలు తీసుకోవాలి

పొన్నలూరు: తనపై అవినీతి ఆరోపణలు చేస్తూ దొంగ లెటర్లు సృష్టించిన జిల్లా సహకార ఆడిట్ అధికారి కార్యాలయంలో పనిచేస్తున్న అటెండర్ నవాజ్‌పై చర్యలు తీసుకోవాలని పొన్నలూరు పీఏసీఎస్ సీఈఓ మనోజ్‌కుమార్ జిల్లా డీసీఓ శ్రీనివాసురెడ్డికి బుధవారం ఫిర్యాదు చేశారు. తనపై వ్యక్తిగత కక్షతో లేనిపోని నిందలుమోపి మానసికంగా ఇబ్బందులకు గురిచేసిన జిల్లా సహకార ఆడిట్ అధికారి పోలిశెట్టి రాజశేఖర్, తన అటెండర్ నవాజ్‌పై చర్యలు తసుకోవాలని విన్నవించాడు.